# ఆమలూరులో విద్యుత్ షాక్‌తో నాలుగు ఆవుల మృతి..

- రైతు కుటుంబంలో విషాదం
- కిందికి ఒరిగిన విద్యుత్ వైర్లే ప్రమాదానికి కారణమని గ్రామస్తుల ఆరోపణ..
- బాధిత రైతుకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్





**గుర్రంపోడు, మే 30(నేటి దర్శిని):** నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని ఆమలూరు గ్రామంలో శనివారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. విద్యుత్ వైర్లు కిందికి ఒరగడంతో వాటికి తగిలిన నాలుగు ఆవులు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలముకోగా, బాధిత రైతు కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది.గ్రామానికి చెందిన రైతు బొమ్మ బాల మల్లయ్య ప్రతిరోజులాగే శనివారం ఉదయం తన పశువులను గ్రామ శివారులో మేతకు తీసుకెళ్లాడు. అయితే గాలి దుమారం కారణంగా విద్యుత్ లైన్ కిందికి ఒరిగి ఉండటాన్ని గమనించని ఆవులు మేత మేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లకు తగిలాయి. హై వోల్టేజ్ విద్యుత్ సరఫరా కొనసాగుతుండటంతో క్షణాల్లోనే నాలుగు ఆవులు ప్రాణాలు కోల్పోయాయి. కళ్లముందే తన జీవనాధారమైన పశువులు మృతి చెందడంతో రైతు బాల మల్లయ్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. పశువుల మరణంతో కుటుంబం ఆర్థికంగా తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటోందని, ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని వేడుకున్నాడు. విద్యుత్ వైర్లు కిందికి ఒరగడమే ప్రమాదానికి కారణమని గ్రామస్తులు, రైతులు ఆరోపిస్తూ విద్యుత్ శాఖ నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న గ్రామ పెద్దలు, రైతులు ఘటనాస్థలికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతిచెందిన నాలుగు ఆవులకు తగిన నష్టపరిహారం మంజూరు చేయడంతో పాటు బాధిత రైతు కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని గ్రామస్తులు, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

## చిల్వేర్ గ్రామంలో 99 డేస్ ప్రణాళికలో భాగంగా అవగాహన కార్యక్రమం





**మిడ్జిల్ మే 30,(నేటి దర్శిని ప్రతినిధి):** మిడ్జిల్ మండలంలోని చిల్వేర్ గ్రామంలో అంగన్వాడి లో శనివారం 99 డేస్ ప్రణాళికలో భాగంగా నో జంక్ ఫుడ్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిల్వేర్ గ్రామ సర్పంచ్ బోల్గం నాగరాజ్ గౌడ్ మాట్లాడుతూ.. జంక్ ఫుడ్ వల్ల ఆరోగ్యం పై కలిగే దుష్ప్రభావాలు పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై వివరించారు. గర్భిణీలు కిశోర బాలికలు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించాలని సూచించారు, రాణిపేట,అయ్యవారిపల్లి,వెలుగోమ్ముల అంగన్వాడి సెంటర్ తల్లులతో సమహవేశం నిర్వహించడం జరిగింది, పిల్లలందరికి గ్రాడ్యుయేష న్ పటాలు పంపిణీ చేయడం జరిగింది, అలాగే ప్రభుత్వం ఇచ్చినటువంటి యూనిఫాంలు కూడా అందరు విద్యార్థులకు ఇవ్వడం జరిగింది, ఈ కార్యక్రమంలో చిల్వేరు గ్రామ సర్పంచ్ బి.నాగరాజు గౌడ్,పంచాయతీ సెక్రెటరీ,ఉప సర్పంచ్ మోహన్, ఐసిడిఎస్ సూపర్వైజర్ అనిత అన్ని గ్రామాల అంగన్వాడీ టీచర్లు పిల్లల తల్లిదండ్రులు గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగింది

## పిఎసిఎస్ ఆమనగల్లు స్థలాన్ని పశువుల సంతకు కేటాయించడం సరికాదు...

- సర్పంచుల సంఘం అధ్యక్షుడు వడ్త్యావత్ శ్రీను నాయక్.....



**ఆమనగల్లు,మే30(నేటి దర్శిని):** ఆమనగల్లు మున్సిపాలిటీ పాలకవర్గం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆమనగల్లు కు కేటాయించిన స్థలాన్ని పశువుల సంతకు కేటాయించడం సరికాదని శనివారం ఆమనగల్లు మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రామ్నుంతల సర్పంచ్ వడ్త్యావత్ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీను నాయక్ మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆమనగల్లు కు సొంత భవనం పట్టణానికి దూరంగా గుర్రం గుట్ట ఆవరణలో ఉన్నది. అట్టి భవనం రైతులకు, ఎరువులకు, మరియు విత్తనాల సరఫరాకు ఇబ్బందులు కలిగినందువలన రైతుల కోరిక మేరకు 2006 సంవత్సరంలో ఎంపీడీవో ఆధీనంలో ఉన్న క్వాటర్స్ లలో ఒక భవనం కేటాయించినారు. అప్పటినుంచి రైతులకు అందుబాటులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనంగా ఉపయోగించుకున్నారు. కావున ఆమనగల్లు బస్టాండ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనుక భాగంలో మండల పరిషత్ ఆధీనంలో ఉన్న క్వాటర్స్ ను గతంలో ప్రాథమిక సహకార సంఘం కోసం తీర్మానం చేసి ఏర్పాటు చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా ఆ ప్రాంతంలోని పిఎసిఎస్ కార్యాలయం నిర్వహించి రైతన్నలకు సేవలు అందించడం జరిగిందన్నారు. ప్రస్తుతం మునిసిపాలిటీ పాలకవర్గం ఆ స్థలంలో బలవంతంగా పశువుల సంత ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిసింది.ఆ స్థలాన్ని ఏదైనా ప్రజా అవసరాలకు వినియోగించాలి తప్ప ఇలా వ్యాపారం కోసం వినియోగించవద్దని కోరుతూ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ పిలుపుమేరకు వారి పాలకవర్గం మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఆమనగల్లు ఎంపీడీవో కార్యాలయంలో అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, సింగిల్ విండో డైరెక్టర్లు జోగు వీరయ్య, దూలియనాయక్, మాజీ ఎంపీటీసీలు దోనాదుల కుమార్,చందు నాయక్, సర్పంచ్ యాదయ్య, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గుత్తి బాలస్వామి,గుజ్జరి గోపి,శివకుమార్,చలి చీమల సతీష్,జంతుక కిరణ్,భాస్కర్, శంకర్,పంతు నాయక్,రంజిత్, యాదయ్య,భూపాల్, తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కు అందజేసిన ఉప సర్పంచ్ విజయ్ రాథోడ్...



**ఆమనగల్లు,మే30(నేటి దర్శిని):** ఆమనగల్లు మండల పరిధిలోని మేడిగడ్డ తండా గ్రామ పంచాయతీలో నేనావత్ దేవి అని లబ్ధిదారురాలికి గ్రామ ఉపసర్పంచ్ విజయ రాథోడ్ 52.000 వేల రూపాయల చెక్కును వారికి అందజేశారు. ఆసుపత్రి ఖర్చులకోసం సీఎం సహాయనిధి కోసం విజయ్ రాథోడ్ దృష్టికి తీసుకెళ్లగా వారు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.అనంతరం దేవికి మంజూరైన 52000 వేల రూపాయల మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కును బాధితురాలికి అందజేశారు.ఉప సర్పంచ్ విజయ్ రాథోడ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం సహాయ నిధి పథకం పేదలకు ఒక వరం లాంటిదని ఆయన అన్నారు.ఇందుకు సహకరించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి వారు కృతజ్ఞతలను తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మల్లేష్ నాయక్,కాంగ్రెస్ సీనియర్ నాయకుడు విజయ్,వార్డు మెంబర్ దేవేందర్,మల్లేష్, భాస్కర్, డీలర్ కృష్ణ, మాజీ ఎంపీటీసీ పరమేష్, రఘు, నరేష్ , పాండు,రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణి



**అమనగల్, మే 30, (నేటి దర్శిని):** అమనగల్ మండలంలోని మేడిగడ్డ తాండ గ్రామపంచాయతీ లో అంగన్వాడీ సెంటర్లో చదువుకుంటున్న విద్యార్థులకు సర్పంచ్ రాజేశ్వరి మల్లేష్. ఉప-సర్పంచ్ విజయ్ రాథోడ్ లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న యూనిఫామ్లు పంపిణి చేశారు. ఈసందర్భంగా ప్రజలు చిన్నారులకు అంగన్వాడీ లకు క్రమము తప్పకుండ అంగన్వాడీలకు పంపాలని కోరారు. క్రమము తప్పకుండ ఆయాలు చిన్నారులకు పౌష్టిక ఆహారం అందించిన వారి ఆరోగ్యంపై దృష్టి పెట్టాలనిఅన్నారు. కార్యక్రమం లో అంగన్వాడీ టీచర్లు సరోజ.నుసారత్ బేగం.మాజీఎంపీపీ అనిత విజయ్ మాజీ ఎంపీటీసీ పరమేశ్వర్. వార్డు మెంబర్లు దేవందర్. మల్లేష్.సితి భాస్కర్.డిల్లర్ కృష్ణ. శంకర్.రాజ్ కుమార్. రమేష్.నరేష్ తదితరులు పాల్గొన్నారు

# సిరిహిల్స్ కాలనీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి
- కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి ఎమ్మెల్యే భరోసా



**మన్సూరాబాద్, మే 30 (నేటి దర్శిని):** మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని సిరిహిల్స్ కాలనీలో చేపట్టిన డ్రైనేజీ పనులు, కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎమ్మెల్యేను కలిసి కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా సుమారు 500 మీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడంతో పాటు, పలు ప్రాంతాల్లో స్ట్రీట్ లైట్లను ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు.వర్షాకాలంలో రహదారులు దెబ్బతినడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కాలనీలో అభివృద్ధి పనులను అత్యవసరంగా చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, కాలనీ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కాలనీవాసులు ప్రస్తావించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి, సీనియర్ మహిళా నాయకురాలు మల్లీశ్వరి రెడ్డి, హయత్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, కొసనం ధనలక్ష్మి వెంకట్ రెడ్డి, చంద్రారెడ్డి, రామచంద్రారెడ్డి, అనిల్ కుమార్, కేకేఎల్, సందీప్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకన్న, గౌరవ అధ్యక్షుడు రాజిరెడ్డి, జనరల్ సెక్రటరీ సుధాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కరుణాకర్, కోశాధికారి ప్రసాద్, జాయింట్ సెక్రటరీ మురళి, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ పెద్దలు మరియు నివాసితులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శి బదిలీ

- ఘనంగా సన్మానించిన గ్రామ సర్పంచ్



**కనగల్, మే30 (నేటి దర్శిని):** కనగల్లు మండలం జి ఎడవల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్కే కాశీం బదిలీ అయ్యారు. నూతన గ్రామ పంచాయతీ కార్యదర్శి గా చిత్రం రమేష్ బాధ్యతలు చేపట్టారు. గ్రామంలో ఉత్తమ సేవలు అందించిన కాశీం బదిలీపై సర్పంచి పరసనబోయిన వెంకటేశం ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆయనను ఘనంగా సన్మానించి వీడ్కోలు తెలిపారు.

## అరుణోదయ కాలనీలో బీటి రోడ్ రీకార్పెటింగ్ పనులకు శ్రీకారం..

●స్థల పరిశీలన చేసిన మాజీ కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి



**హయత్‌నగర్, మే 30 (నేటి దర్శిని):** ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని అరుణోదయ కాలనీ రోడ్ నంబర్–6లో చేపట్టనున్న బీటీ రోడ్ రీకార్పెటింగ్ పనుల నేపథ్యంలో మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి శనివారం కాలనీవాసులతో కలిసి స్థల పరిశీలన నిర్వహించారు. తన హయాంలో మంజూరైన నిధులతో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనుల సందర్భంగా రహదారి పరిస్థితులను పరిశీలించి, రోడ్డు లెవల్స్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. అలాగే వర్షాకాలంలో రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పనులను త్వరితగతిన ప్రారంభించి నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తున్నామని, కాలనీల సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి కొనసాగిస్తామని తెలిపారు. అభివృద్ధి పనులు ప్రారంభం కానుండటంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ మాజీ కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## గౌరారం సర్పంచ్ గరం.. అభివృద్ధిని అడ్డుకుంటున్న కాంగ్రెస్

●గ్రామాభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తున్నారు: గౌరారం సర్పంచ్ ఊరే లింగయ్య
●వివో భవనం, సీసీ రోడ్లు, చెక్‌డ్యామ్‌ల పనులు నిలిచిపోయాయని ఆవేదన
●గ్రామాభివృద్ధికి స్థానిక కాంగ్రెస్ నేతలే అడ్డంకిగా మారారని ఆరోపణ
●బీఆర్‌ఎస్ హయాంలో గ్రామాలు అభివృద్ధి చెందాయని వ్యాఖ్య
●ధాన్యం కొనుగోలులో రైతులకు అన్యాయం జరుగుతోందని విమర్శ
●ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పారదర్శకత లోపించిందని ఆరోపణ



**కనగల్, మే 30 (నేటి దర్శిని):** నల్గొండ జిల్లా కనగల్ మండలంలోని గౌరారం గ్రామ అభివృద్ధి పనులు స్థానిక కాంగ్రెస్ నాయకుల కారణంగా నిలిచిపోయాయని గ్రామ సర్పంచ్ ఊరే లింగయ్య ఆరోపించారు. శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలు రాజకీయ కారణాలతో ఆలస్యమవుతున్నాయని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గౌరారం గ్రామంలోని 10 వార్డుల్లో 8 వార్డులను బీఆర్‌ఎస్ మద్దతుదారులు గెలుచుకున్నారని, తాను కూడా సర్పంచ్‌గా ప్రజల మద్దతుతో ఎన్నికయ్యానని తెలిపారు. అయితే గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులు చేపట్టడంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. గ్రామానికి మంజూరైన వివో భవనం (మహిళా సమాఖ్య భవనం), సీసీ రోడ్లు, అంగన్‌వాడీ భవనాలు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద చెక్‌డ్యామ్‌ల నిర్మాణ పనులు ముందుకు సాగకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. దీంతో గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి నిలిచిపోయిందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో రైతు వేదికలు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, తాగునీరు, సాగునీటి సదుపాయాలు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా అమలయ్యాయని లింగయ్య పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై కూడా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు సమయంలో అదనపు కటింగ్‌లు, నాణ్యత పేరుతో కోతలు విధించడం వల్ల రైతులు నష్టపోతున్నారని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత ఉండాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియలో కూడా పలు అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించిన ఆయన, అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాభివృద్ధి రాజకీయాలకు అతీతంగా సాగాలని, ప్రజల అవసరాలే ప్రధానంగా ఉండాలని సర్పంచ్ ఊరే లింగయ్య అభిప్రాయపడ్డారు.

## పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ శిబిరం ప్రారంభం





**నాగోల్, మే 30 (నేటి దర్శిని):** రంగారెడ్డి అర్బన్ జిల్లా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ శిబిరం శనివారం బండ్లగూడ నాగోల్‌లోని శ్రేయస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా ప్రారంభమైంది. జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 300 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. మే 30, 31 తేదీలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ శిక్షణ శిబిరంలో బీజేపీ సిద్ధాంతం, పార్టీ చరిత్ర, వికాసం, దేశం ఎదుర్కొంటున్న సామాజిక–రాజకీయ సవాళ్లు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సోషల్ మీడియా ప్రాముఖ్యత తదితర అంశాలపై కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ అందించనున్నారు. శిబిర ప్రారంభ కార్యక్రమానికి బీజేపీ తెలంగాణ రాష్ట్ర మహా సంఘటన మంత్రి చంద్రశేఖర్ తివారి ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తల పాత్ర కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శిబిర ప్రముఖ్ గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. గౌతమ్ రావు, సామ రంగారెడ్డి, రవికుమార్ యాదవ్, మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నరసింహారెడ్డి, చింతల అరుణ, సురేందర్ యాదవ్, రాష్ట్ర మరియు జిల్లా పదాధికారులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళల సమస్యల పరిష్కారానికి జెండర్ రిసోర్స్ సెంటర్





●దేవరకొండలో ఉచిత కుటుంబ సలహా కేంద్రం ప్రారంభం
●మహిళలకు న్యాయ, మానసిక సహాయం అందించడమే లక్ష్యం: డీఆర్‌డీఓ పీడీ శేఖర్ రెడ్డి



**దేవరకొండ, మే 30 (నేటి దర్శిని):** మహిళల సాధికారతతో పాటు వారి సమస్యల పరిష్కారానికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం జెండర్ రిసోర్స్ సెంటర్లను ఏర్పాటు చేస్తోందని డీఆర్‌డీఓ పీడీ శేఖర్ రెడ్డి తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా డీఆర్‌డీఏ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత కుటుంబ సలహా కేంద్రం (జెండర్ రిసోర్స్ సెంటర్)ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలు, సమాజంలో జరుగుతున్న పలు ఘటనల కారణంగా మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తమ సమస్యలను ఎవరికీ చెప్పుకోలేక మానసికంగా కుంగిపోతున్నారని పేర్కొన్నారు. అలాంటి వారికి జెండర్ రిసోర్స్ సెంటర్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కుటుంబ సమస్యలు, మహిళల హక్కులు, లింగ వివక్ష, గృహహింస, ఆరోగ్యం, పోషకాహారం వంటి అంశాలపై ఉచితంగా న్యాయ, మానసిక సలహాలు అందించనున్నట్లు తెలిపారు. అన్యాయానికి గురైన మహిళలకు కౌన్సిలింగ్ నిర్వహించి సమస్యలకు పరిష్కారం చూపేలా సహకారం అందిస్తామని చెప్పారు. బాధితులు నేరుగా కేంద్రాన్ని సంప్రదించి సేవలు పొందవచ్చని సూచించారు. ఈ సందర్భంగా 72 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా మంజూరైన చెక్కులను అందజేశారు. అనంతరం జెండర్ కమిటీ సభ్యులు, మండల సమాఖ్య ఓబీలు, వివోఏలను సన్మానించారు. కార్యక్రమానికి ముందు ఎంపీడీవో కార్యాలయం నుంచి కోదాడ--జడ్చర్ల జాతీయ రహదారి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో డానియేలు, సీఐ వెంకట్ రెడ్డి, సెర్ప్ పీఎం లింగం గౌడ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, ఏపీఎం విజయలక్ష్మి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కొర్ర రామ్‌సింగ్ నాయక్, సీడీపీఓ చంద్రకళ, సీసీలు, జెండర్ కమిటీ సభ్యులు, వివోఏలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డల ఆత్మగౌరవానికి అండగా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

● 53 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ




**ఇబ్రహీంపట్నం, మే 30 (నేటి దర్శిని):** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంపొందించే గొప్ప సంక్షేమ కార్యక్రమాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఇబ్రహీంపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో మంచాల మండలానికి చెందిన 53 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆడబిడ్డల వివాహాలు కుటుంబాలకు ఆర్థిక భారం కాకుండా ఆనందోత్సాహాల నడుమ జరగాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సామాజిక సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తోందన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, భవిష్యత్తులో కూడా పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు మరింత మేలు చేసే పథకాలను అమలు చేస్తామని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా కృష్ణ గోపాల్ సేవా సమితి

● భక్తులకు ప్రసాదం.. వృద్ధులకు భోజనం.. మానవతను చాటిన శ్రీ కృష్ణ గోపాల్ సేవా సమితి







**ఎల్.బి.నగర్, మే 30(నేటి దర్శిని):** “మానవ సేవయే మాధవ సేవ” అనే మహోన్నత లక్ష్యంతో కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం రెండు సేవా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. తీవ్ర ఎండలను సైతం లెక్కచేయకుండా సమితి సభ్యులు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని తమ సేవాభావాన్ని చాటుకున్నారు. మొదటిగా నగరంలోని ప్రముఖ హనుమాన్ దేవాలయంలో 2,000 మందికి పైగా భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు “జై శ్రీరామ్” నినాదాల మధ్య భక్తిశ్రద్ధలతో ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం రెండో కార్యక్రమంలో వృద్ధాశ్రమంలో నివసిస్తున్న 40 నుంచి 50 మంది వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేకంగా మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. వృద్ధులు ఎంతో ఆనందంగా, సంతృప్తిగా భోజనం స్వీకరించి సమితి సభ్యులను ఆశీర్వదించారు. ఈ సేవా కార్యక్రమాలు విజయవంతగా నిర్వహించడంలో కృష్ణ గోపాల్ సేవ సమితి సభ్యులు, మిత్రులు అందించిన సహకారం అభినందనీయమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కృష్ణ గోపాల్ సేవ సమితి అధ్యక్షులు కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ, సేవా కార్యక్రమాల్లో పాల్గొని సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా సమాజ సేవకు అంకితభావంతో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని ఆయన వెల్లడించారు.

# అర్హులైన మహిళలకు ఇందిరమ్మ చీరలు

● దేవరకొండలో పంపిణీ ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ శైలజ



**దేవరకొండ, మే 30 (నేటి దర్శిని):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో భాగంగా దేవరకొండ పట్టణంలో అర్హులైన మహిళలకు చీరల పంపిణీ ప్రారంభమైంది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు చీరలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రేషన్ కార్డు కలిగి 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరలు అందజేయనున్నట్లు తెలిపారు. జూన్ 2వ తేదీలోపు పట్టణంలోని 20 వార్డుల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి మెప్మా రిసోర్స్ పర్సన్లు, వార్డులకు కేటాయించిన అధికారుల ద్వారా చీరల పంపిణీ పూర్తి చేస్తామని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామదుర్గా రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ జువేరియా తబస్సుమ్, కౌన్సిలర్లు చంద్రకళ, మాధవి, సావిత్రి, సుమలత, పద్మ, అంకులమ్మ, శ్రీకన్య, భవాని, యూనుస్, అజయ్ చంద్ర, సాయిచంద్ర గౌడ్, రూప్ల నాయక్, నవీద్, మెప్మా టీఎంసీ జగమంతు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.




# వికలాంగుల కార్పొరేషన్ పదవుల్లో కొత్తవారికి అవకాశం కల్పించాలి

● వికలాంగుల రాజ్యాధికార ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు వంశరాజ్ రామచంద్ర

**హైదరాబాద్, మే 30 (నేటి దర్శిని):** తెలంగాణ రాష్ట్రంలో త్వరలో భర్తీ కానున్న కార్పొరేషన్ పదవులలో భాగంగా వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ మరియు ఇతర కీలక పదవులకు పార్టీ కోసం దీర్ఘకాలంగా సేవలందించిన దివ్యాంగ కార్యకర్తలకు అవకాశం కల్పించాలని వికలాంగుల రాజ్యాధికార ఫోరమ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని కోరింది. ఈ సందర్భంగా వికలాంగుల రాజ్యాధికారం ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు వంశరాజ్ రామచంద్ర మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా గత 25 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న అనేక మంది దివ్యాంగ కార్యకర్తలు ఉన్నారని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు అధికారంలో ఉన్న సమయంలో కూడా పార్టీని వీడకుండా కాంగ్రెస్ సిద్ధాంతాలను నమ్ముకొని పనిచేసిన కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటివరకు పదవులు నిర్వహించిన వారికి మళ్లీ అవకాశం కల్పించడం కంటే, దివ్యాంగుల సమస్యలపై అవగాహనతో పనిచేస్తున్న కొత్తవారికి అవకాశం ఇవ్వడం ద్వారా జాతి బలోపేతానికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. దివ్యాంగుల సంక్షేమం పట్ల కాంగ్రెస్ పార్టీకి ప్రత్యేక చరిత్ర ఉందని పేర్కొన్న ఆయన, దేశంలోనే తొలిసారిగా వికలాంగుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని గుర్తుచేశారు. ఇందిరాగాంధీ నుంచి రాహుల్ గాంధీ వరకు కాంగ్రెస్ నాయకత్వం దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది దివ్యాంగులు ఉన్నారని, వీరిలో అధిక సంఖ్యలో ప్రజలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కృషి చేశారని తెలిపారు. అందువల్ల కార్పొరేషన్ పదవుల నియామకాల్లో కొత్తవారికి కూడా సముచిత ప్రాధాన్యత కల్పించి, దివ్యాంగుల అభ్యున్నతికి కృషి చేసే నాయకులకు అవకాశం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మరియు పార్టీ అధిష్టానాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వికలాంగుల రాజ్యాధికార ఫోరమ్ తరఫున రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వానికి తమ వినతిని సమర్పిస్తున్నట్లు వంశరాజ్ రామచంద్ర తెలిపారు

# గాంధీభవన్‌లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ సమీక్ష సమావేశం...

- హాజరైన ఉప్పల్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి...



**నాగారం, మే 30:-(నేటి దర్శిని):** గాంధీభవన్ ప్రాంగణంలోని ఇందిరా భవన్‌లో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జ్ శ్రీమతి మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో బూత్ ఏజెంట్లు, అన్ని డివిజన్ కమిటీలు మరియు అనుబంధ సంఘాల కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేయాలి. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలి" అని దిశానిర్దేశం చేశారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూరాష్ట్రంలో త్వరలోనే ప్రారంభం కానున్న "ఎస్.ఐ.ఆర్" "సర్' ప్రక్రియపై సమగ్రంగా చర్చించారు . క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. మల్కాజిగిరి పార్లమెంట్‌లో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు, సూచనలు అందించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలనను ప్రతి గడపకు చేర్చాలి" అని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మల్కాజిగిరి పార్లమెంట్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, జిల్లా అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, అసెంబ్లీ కోఆర్డినేటర్లు, నియోజకవర్గ ఇంచార్జిలు మైనంపల్లి హన్మంతరావు, శ్రీ బండి రమేష్, శ్రీ కోలన్ హనుమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉప్పల్ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి స్పందిస్తూ "అధిష్టానం ఆదేశాల మేరకు ఉప్పల్ నియోజకవర్గంలో బూత్ ఏజెంట్లు, డివిజన్ కమిటీల నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం. సర్ ప్రక్రియలో కార్యకర్తలను భాగస్వామ్యం చేస్తాం. రేవంతన్న పాలనలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తాం" అని తెలిపారు.

# ఉపాధి హామీ పనులను పారదర్శకంగా చేపట్టాలి...



**ఆమనగల్లు,మే30(నేటి దర్శిని):** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండల పరిధిలోని మేడిగడ్డ తాండ గ్రామపంచాయతీలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను ఉపసర్పంచ్ విజయ్ రాథోడ్, ఏపిఎం మాధవరెడ్డి తో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ పరిధిలో చేపట్టనున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ అభివృద్ధికి ఉపాధి హామీ పథకం ఎంతో కీలకమని, ఈ పథకం ద్వారా గ్రామీణులకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. అలాగే పనులు నాణ్యతతో, పారదర్శకంగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ రవీందర్, గ్రామస్తులు,ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల అక్షరాభ్యాసానికి పునాది అంగన్వాడీ కేంద్రాలు...



**ఆమనగల్లు,మే30(నేటి దర్శిని):** ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని 4వ అంగన్వాడి కేంద్రం నందు99 రోజుల "ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక" అనే కార్యక్రమంలో శనివారం ర్యాలీ నిర్వహించి విద్యార్థినీ,విద్యార్థులకు యూనిఫామ్ లను వారికి అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కౌన్సిలర్లు ప్రముఖ సంఘ సేవకులు పాపిశెట్టి రాము, పుల్లారెడ్డి అనూష శ్రీశైలం, హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ పాపిశెట్టి రాము మాట్లాడుతూ అక్షరాభ్యాసానికి పునాది అంగన్వాడి కేంద్రాలు అని ఆయన అన్నారు. ప్రాథమిక పాఠశాలలకు వెళ్లే విద్యార్థినీ,విద్యార్థులకు సర్టిఫికెట్లను, యూనిఫామ్ లను అందజేశారు. అలాగే కౌన్సిలర్ పాపిశెట్టి రాము అంగన్వాడీ కేంద్రానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తన సొంత నిధులతో అంగన్వాడి కేంద్రానికి పెయింటింగ్ మరియు విద్యుత్ సరఫరాను కల్పించారు. అంగన్వాడి టీచర్లు, విద్యార్థిని విద్యార్థుల తల్లులు కౌన్సిలర్లను పాపిశెట్టి రాము, అనూష శ్రీశైలం ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సంధ్య,విమల, రాజ్యలక్ష్మి,సునీత, లక్ష్మమ్మ,,మరియు ఆయాలు, గర్భిణీ స్త్రీలు,బాలింతలు, తల్లులు,పిల్లలు, ఆశా కార్యకర్తలు,తదితరులు హాజరయ్యారు.

# జోనల్ కమిషనర్ వికాస్ మహతోను మర్యాదపూర్వకంగా కలిసిన ముద్దగౌని లక్ష్మీప్రసన్న రామ్మోహన్ గౌడ్




**బీఎన్ రెడ్డి నగర్ మే 30 (నేటి దర్శిని):** బీఎన్ రెడ్డి నగర్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న రామ్మోహన్ గౌడ్ శనివారం ఎల్‌బీనగర్ జోన్ జోనల్ కమిషనర్ వికాస్ మహతోను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీఎన్ రెడ్డి నగర్, సాహెబ్‌నగర్ డివిజన్ల పరిధిలోని పలు కాలనీల్లో నెలకొన్న మౌలిక సదుపాయాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా రోడ్ల అభివృద్ధి, వరదకాలువల నిర్మాణం, వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వివరించారు. అలాగే ఆయా అభివృద్ధి పనుల కోసం అవసరమైన నిధులను మంజూరు చేసి, త్వరితగతిన పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందేలా నిరంతరం కృషి చేస్తానని, కాలనీల అభివృద్ధికి అవసరమైన అన్ని అంశాలపై అధికారులతో సమన్వయం కొనసాగిస్తానని లక్ష్మీప్రసన్న రామ్మోహన్ గౌడ్ తెలిపారు.

# ఘనంగా బింగో సర్కస్ ప్రారంభం




**ఎల్బీనగర్, మే30 (నేటి దర్శిని):** ఎల్బీనగర్ కామినేని ఆసుపత్రి సమీపంలో బింగో సర్కస్ ఘనంగా ప్రారంభమైంది. ప్రపంచంలోని వివిధ రకాల జంతువులతో నిర్వహిస్తున్న వినూత్న ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరినీ అలరించే విధంగా కామెడీ షోలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.సర్కస్ ప్రాంగణంలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు సందర్శకుల సౌకర్యార్థం పార్కింగ్ సదుపాయం కూడా కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. కుటుంబ సమేతంగా వచ్చి సర్కస్‌ను వీక్షించాలని వారు కోరారు. పిల్లలు, యువకులు, మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని వినోదాన్ని ఆస్వాదించాలని సూచించారు.

